సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్ అవంతినగర్ మోతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లోని శివ రామాంజనేయ ఆలయంలో మంగళవారం ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. కార్తీక మాసంలో ప్రతి రోజు పర్వదినమేనని నెల రోజుల పాటు నిత్యం శివుని నామస్మరణతో పూజలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని భక్తుల విశ్వాసమన్నారు. ఆలయంలో సామూహిక అభిషేకాలు సైతం నిర్వహించారు. డిసెంబర్ 1 వరకు ప్రతి రోజు ఉదయం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆలయంలోని పలు ఉప దేవాలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పక్కాగా పశుగణన

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 21వ జాతీయ పశుగణన ప్రారంభమైంది. ఆగస్టులోనే మొదలు కావాల్సిన పశుగణన అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. ప్రతి ఐదేళ్లకోసారి పశుగణన చేయాల్సి ఉంటోంది. 2018లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పశుగణన జరిగింది. జిల్లాలో దీనికి సంబంధించి పశుగణకులు, (సూపర్‌వైజర్లు) పర్యవేక్షకులకు శిక్షణ పూర్తి చేశారు. ఈ పశుగణన పూర్తిగా డిజిటల్ విధానంలో చేస్తున్నారు. అందుకు తగిన విధంగా సమాచారం సేకరిస్తున్నారు. ఫిబ్రవరి 25 వరకు మేడ్చల్ జిల్లాలో పశుగణన పూర్తయ్యేలా జిల్లా పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటోంది. జనాభా ఆధారంగా రెండు, మూడు లొకేషన్లను కలిపి ఒక సూపర్‌వైజర్ నియమించారు.

– సాక్షి, సిటీబ్యూరో

- ఐదేళ్ల తర్వాత కొనసాగుతున్న పశుగణన
- 2018లో చేపట్టిన కేంద్ర ప్రభుత్వం
- ఫిబ్రవరి 25 కల్లా పూర్తయ్యేలా జిల్లా పశు సంవర్ధక శాఖ కసరత్తు
- పశుసంపద ద్వారా వచ్చే ఆర్థికాదాయం, నిధుల మంజూరు తదితర వాటిపై దృష్టి



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పశుగణన ఇలా

మండలాలు	15
లొకేషన్లు	279
ఎన్యుమరేటర్లు	79
సూపర్ వైజర్లు	16
నోడల్ అధికారి	01

డిజిటల్ విధానంలో..

జిల్లాలో ఇప్పటికే పశుగణకులు క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించారు. డిజిటల్ విధానంలో యాప్ ద్వారా గణన చేసేందుకు అవసరమైన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చారు.. ఈ నెల 5 నుంచి మేడ్చల్ జిల్లాలో పూర్తి స్థాయిలో డిజిటల్ విధానంలో పశుగణనను ఎన్యుమరేటర్లు చేపడుతున్నారు.

ప్రణాళికా అవసరాల కోసం..

భారతదేశం విభిన్న పశు సంపదకు నిలయం. పశు సంపద ద్వారా వచ్చే ఆర్థికాదాయం గణనీయమైన పాత్ర పోషిస్తోంది. అభివృద్ధి, సంక్షేమం కోసం పశుగణన చాలా కీలకమైనది. ఏయే జాతి పశువుల సంతతి ఎంత ఉంది?, ఏది తగ్గుతోంది?, ఏది పెరుగుతుంది? అనే విషయం పశుగణన ద్వారా కూడా తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం తగిన ప్రణాళిక తయారు చేసి పశు సంపద అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గడిచిన లెక్కల ప్రకారం వివిధ జాతుల పశువుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లాలో గోజాతి పశువులు 27,068 ఉండగా, గేదె జాతి పశువులు 59,895 ఉన్నాయి. గొర్రెలు1,49,401, మేకలు 40,020, పందులు 2,485, కోళ్ల సంఖ్య 39,72,037 ఉన్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అంచనా వేస్తోంది.

రైతులు సహకరించాలి

పశుగణకులు ఇంటికి వచ్చినప్పుడు రైతులు తమ పశువుల వివరాలను నమోదు చేయించుకోవాలి. జిల్లాలో ఏజాతి పశువులు ఎన్ని ఉన్నాయనే విషయం తెలుస్తోంది. దీనికి అనుగుణంగా పశుసంవర్ధకశాఖ మందుల సరఫరా చేయటం, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఉపయోగపడుతుంది. రైతులందరూ సహకరించాలి.

– డాక్టర్.సుధాకర్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మోతీనగర్: దీర్ఘకాలంగా పేరుకుపోయిన నల్లా బిల్లులను చెల్లించేందుకు వన్ టైం సెటిల్‌మెంట్ ను(ఓటీఎస్) సద్వినియోగం చేసుకోవాలని జల మండలి అధికారులు అన్నారు. గాయత్రినగర్, పర్వత్‌నగర్, తులసినగర్, అల్లాపూర్ ప్రాంతాల్లో మంగళవారం డ్రైవ్ నిర్వహించారు.30వ తేదీ లోగా బిల్లులు చెల్లించినన వారికే స్కీం వర్తిస్తుందన్నారు. ఈ స్కీం కోసం గాయత్రినగర్ మేనేజర్ 8790011922, ఆయా ప్రాంతాల్లో పని చేస్తున్న బిల్ కలెక్టర్లు సంజీవ 9493311549 వివేకానందనగర్, జ్యోతి నగర్, విజయ్ పర్వత్‌నగర్, జేపీ నగర్, అల్లాపూర్, న్యూ అల్లాపూర్, సెంట్రల్ అల్లాపూర్, ఫ్రెండ్స్ కాలనీ, కేజీఎస్ నగర్, లక్ష్మీ నగర్, శివబస్తీ, జశ్వంత్ 8328194770 గాయత్రినగర్, తులసి నగర్, నవీన్ 9640053297 పద్మావతినగర్, మీరజీనగర్, అజీజ్ నగర్ ఆయా ప్రాంతాల బిల్ కలెక్టర్లను సంప్రదించాలని గాయత్రి నగర్ జలమండలి ఏరియా మేనేజర్ అన్విత్‌కుమార్ తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం : జెడ్సీ

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. మంగళవారం ప్రభాకర్‌రెడ్డి నగర్, జింకల వాడ, సమతా నగర్, దీన్‌దయాల్ నగర్‌లో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, అధికారులతో కలిసి పర్యటించారు. అంతర్గత రోడ్ల నిర్మాణం, శ్మశాన వాటిక సమస్యను పరిశీలించారు. వెంటనే నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కార్పొరేటర్ సతీష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సీ చిన్నారెడ్డి అధికారులు, నాయకులు మహేందర్, హరిబాబు, సతీష్, సల్లావుద్దీన్, లక్ష్మణ్, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న జెడ్సీ అపూర్వ చౌహాన్, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

పనులు పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి ప్రధాన రహదారి ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లమ్మ చెరువు వద్ద ప్రధాన రహదారిలో ఇటీవల జరుగుతున్న రోడ్డు విస్తరణ, పైపులైన్ నిర్మాణ పనుల వల్ల వాహనదారులకు ఇబ్బంది ఏర్పడిందని అన్నారు. అతి త్వరలోనే నిర్మాణ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ క్యాంపస్ లోపల ఉన్నటువంటి డ్రైనేజీ లీకేజీ సమస్యతో పాటు చుట్టు పక్కల కాలనీల సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అదేవిధంగా భగత్‌సింగ్ నగర్ ఫేజ్ 1, 6వ ఫేజ్ కాలనీ వాసులు పడే ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులతో మాట్లాడి సమస్యను సత్వరమే పరిష్కరించాలని జేఎన్‌టీయూ అధికారులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

13న అభ్యర్థనలు ఇవ్వండి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాకు సంబంధించి అభ్యనర్థనలు, సలహాలు, ఆక్షేపణలను స్వీకరించేందుకు కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి డెడికేటెడ్ కమిషన్ బృందం ఈ నెల 13న వస్తోందని, ఆసక్తి కలిగిన వారందరూ వారిని కలువచ్చునని బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పార్టీల నాయకులు, బీసీసంఘాలు, ప్రజలు అందజేసే వినతి పత్రాలను కమిషన్ బృందం స్వీకరిస్తుందన్నారు. ఈనెల 13న ఉదయం 10.30 గంటల నుంచి అభ్యర్థనలను తీసుకుంటారని పేర్కొన్నారు. కమిషన్ బృందంలో చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు, సెక్రెటరీ సైదులు తదితరులు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు.

కలెక్టర్‌పై దాడికి నిరసనగా ఆందోళన



సాక్షి,సిటీబ్యూరో: వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ.. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు అందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు భద్రత కల్పించాలని వారు కోరారు. ఇటువంటి ఘటన వల్ల అభద్రతాభావన కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనా కార్యక్రమంలో టీజీఏ జిల్లా నేతలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు విజయకుమారి, సైదులు, వినోద్ కుమార్, రాంమోహన్, కురుమూర్తి శ్రీనివాస్‌మూర్తి, రాజేశ్వర్‌రెడ్డి వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



కూకట్‌పల్లి: అచ్చంపేట ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను వేద పండితులు ఆశీర్వదించి శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

21న కలెక్టరేట్ వద్ద ధర్నా



సాక్షి,సిటీబ్యూరో: జూన్‌లో జరిగిన టీచర్ల బదిలీ కౌన్సిలింగ్‌లో స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయులపై చర్య తీసుకోకుండా తాత్సారం చేయడంపై ఈ నెల 21న కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేయనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యాయ సంఘాల జేఏసీ హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ ఏడీ లింగానందంకు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నోటీసులతో కూడిన వినతి పత్రం అందజేశారు. బదిలీ కౌన్సిలింగ్‌లో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై సంబంధిత టీచర్లపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులతో సహా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత టీచర్లపై చర్యలు తీసుకోవటంలో జరుగుతున్న తాత్సారాన్ని నిరసిస్తూ.. ఈ నెల 21న ధర్నా చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఏడీకి వినతి అందజేసిన వారిలో ఉపాధ్యాయ సంఘాల జేఏసీ జిల్లా నాయకులు జయసింహారెడ్డి(టీఎస్‌యూటీఎఫ్), వెంకటేశ్వర్లు (ఎస్టీయూటీఎస్), రాజ్‌కుమార్ (టీపీయూఎస్), విఠల్(టీయూటీఎఫ్), బ్రహ్మచారి(టీపీటీఎఫ్) ఉన్నారు.

తలకు గాయంతో మహిళ మృతి!

కేపీహెచ్‌బీకాలనీ: రోడ్డుపై ప్లాస్టిక్ బాటిల్స్, ఐరన్ రాడ్స్, పేపర్లు సేకరించి జీవనం కొనసాగించే మహిళ తలకు గాయం కావటంతో మృతి చెందింది. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కావలి మల్లేష్, బీరమ్మ (40 రోడ్డుపై ఉన్న ప్లాస్టిక్ బాటిల్స్, పేపర్లు, ఐరన్ రాడ్లు సేకరించి అమ్ముకుని జీవనం కొనసాగిస్తుంటారు. రాత్రిళ్లు కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ దగ్గర నిద్రపోతుంటారు. మంగళవారం ఉదయం తెల్లవారుజామున మల్లేష్ తన భార్య బీరమ్మను నిద్రలేపాడు. ఆమె నిద్ర లేవకపోవడంతో ఆరోగ్యం బాగుండక లేవలేదని భావించి తాను ఏరుకొచ్చిన బాటిళ్లు అమ్ముకోవడానికి వెళ్లి తిరిగి 11 గంటల సమయంలో వచ్చాడు. తన భార్యను లేపడానికి ప్రయత్నించగా లేవలేదు. శ్వాస ఆడకుండా నోటిలో నుంచి రక్తం వచ్చి మృతి చెందింది. గత రాత్రి ఇద్దరు మద్యం సేవించారు. మద్యం మత్తులో కింద పడిపోయి తలకు గాయమై చనిపోయిందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులపై దాడులు సరికాదు

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన జిల్లా నేతలు



సాక్షి,సిటీబ్యూరో: వికారాబాద్ జిల్లాలోని దుద్యాల మండలం లగిచర్ల గ్రామంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడిని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీఓ) జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి కురుమూర్తి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల్లో పని చేసే అధికారులు, ఉద్యోగులు వికారాబాద్ కలెక్టర్‌పై దాడికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. టీజీఏ పిలుపు మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్ తెలిపారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు టీజీఏ జిల్లా నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వినోద్ కుమార్, కురుమూర్తి, వెంకటేశం, కరుణాకర్‌రెడ్డితో సహా జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాక్స్‌టైప్ డ్రైన్ పనుల్లో వేగం పెంచాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న బాక్స్‌టైప్ డ్రైన్ పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మంగళవారం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గాను బాక్స్ టైప్ డ్రైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఈఈ దుర్గా ప్రసాద్, డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, నాయకులు లక్ష్మణ్ యాదవ్, గోపాల్‌యాదవ్, సురేష్ రాథోడ్, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ–ఎంఐఐహెచ్ మధ్య ఒప్పందం

రాయదుర్గం: మైక్రో ఇన్సూరెన్స్ రంగంలో పురోగతి లక్ష్యంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ–మైక్రో ఇన్సూరెన్స్ ఇన్నోవేషన్ హబ్ (ఎంఐఐహెచ్)ల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు మంగళవారం ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ భాగస్వామ్యం అభివృద్ధి, సామర్థ్యంను ప్రోత్సహించడం వంటి కీలక అంశాలపై దృష్టి సారిస్తుంది. హెచ్‌సీయూ కోఆర్డినేటర్‌గా స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ దేబాషిస్ ఆచార్య వ్యవహరిస్తారు. అలాగే ఎంఐఐహెచ్‌కి సమన్వయకర్తగా ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుప్రియాగోలి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ మేరకు ఎంఐఐహెచ్ ఫౌండర్ అసోసియేట్ మైక్రోఎన్‌సూర్ సీఈఓ కమలాకర్‌సాయి పలవాసల, హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ బీజేరావు మాట్లాడుతూ ఈ ఒప్పందంతో నైపుణ్యం పెంపు, వాటాదారులకు శిక్షణ ఇవ్వడానికి, జ్ఞాన భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డీన్ ప్రొఫెసర్ ఆర్ విజయ్, ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సామ్రాట్ సబాత్,హెచ్‌సీయూ పీఆర్‌ఓ ఆశిష్ జోకబ్ థామస్, మైత్ర దాసరి, అలేఖ్య వాకలపూడి, అదితి, ఆయేషా, సున్నం నరేష్ పాల్గొన్నారు.

నాలా పనుల్లో నాణ్యత పాటించాలి



నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: నాలా నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామారావు నగర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నాలా పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో నాలా పొంగి ఇళ్లల్లోకి మురుగునీరు చేరుతుండటంతో ఎమ్మెల్యే కృష్ణారావు చొరవతో సమస్యను పరిష్కరించుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రంజిత్, డివిజన్ కో ఆర్డినేటర్ వీరారెడ్డి, వెంకటయ్యయాదవ్, జ్ఞానేశ్వర్, రాంరెడ్డి, నరసింహ, వెంకటరమణ, మహేష్, శివ, యోగిరాజు, ఉమ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ సభ్యులు కాలనీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకాష్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గౌతమ్‌గౌడ్, అధ్యక్షులు పవన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, కోఆర్డినేటర్ బెనర్జీ, పరమేశ్వర్, రమేష్ గౌడ్, నరేందర్ గౌడ్, తిరుపతిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

లిఫ్ట్ లేదు.. లైట్లు లేవు..

- మూసాపేట ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పైకి వెళ్లలేక ఇబ్బందిపడుతున్న వృద్ధులు
- వంతెనపై తాండవిస్తున్న అపరిశుభ్రత
- అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్

మూసాపేట చౌరస్తా వందలాది మంది రాకపోకలు సాగించే ప్రాంతం కావడంతో పాదచారులు రోడ్డు దాటే క్రమంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు పాదచారుల వంతెనను నిర్మించారు. హడావిడిగా అరకొర సౌకర్యాలతో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. నేటికీ పూర్తి చేయాల్సిన పనులు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. లిఫ్ట్ లేకపోవడం, వంతెనకు ఏర్పాటు చేసిన లైట్లు వెలగకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – మూసాపేట

పూర్తికాని లిఫ్ట్ పనులు

రూ.2.90 కోట్ల వ్యయంతో 2022 అక్టోబర్‌లో పనులకు శ్రీకారం చుట్టి 2023 జూలైలో వంతెనను ప్రారంభించారు. లిఫ్ట్ సౌకర్యం అందుబాటులోకి రాలేదు. ఆ పనులు కూడా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపినప్పటికీ సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికి లిఫ్ట్ అందుబాటులోకి రాలేదు. లిఫ్ట్‌తో పాటు రాత్రి సమయంలో లైట్లు వెలగక చీకట్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తున్నది. మహిళలు, వృద్ధులు రాత్రి సమయంలో వంతెన ఎక్కాలంటే భయపడుతున్నారు. సమీపంలో ఉన్న బ్యాంకుల్లో వృద్ధాప్య పింఛన్లు తీసుకునేందుకు ఎక్కువగా రోడ్డుకు అటు ఇటు రావడానికి ఈ వంతెనను ఉపయోగించుకుంటారు. లిఫ్ట్ లేకపోవటం, మెట్లపై మట్టి పేరుకుపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. కాగా వంతెన అందుబాటులోకి వచ్చిన తరువాత రోడ్డు దాటేందుకు వీలులేకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో యూటర్న్‌ల వద్ద రోడ్డు దాటాల్సి వస్తోంది. అంతేకాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వలస కార్మికులు ఎక్కువగా నివసించే ప్రాంతాలైన బాలానగర్, జింకలవాడ, ప్రశాంత్‌నగర్‌లలోని పరిశ్రమలు, కంపెనీలలో ఉదయం వెళ్లి తిరిగి సాయంత్రం ఇళ్లకు చేరుకుంటారు. ఆయా సమయాలలో రద్దీ ఉంటుంది. వంతెన ఉన్నా లేనట్లు కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చాం

ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మించిన కాంట్రాక్టర్‌కు లిఫ్ట్‌ను నిర్మించాలని నోటీసులు జారీ చేశాం. త్వరలోనే లిఫ్ట్ పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. – ఏఈ రాధాకృష్ణ, జీహెచ్‌ఎంసీ కార్యాలయం



మూసాపేట ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద లిఫ్ట్ నిర్మించాల్సిన ప్రాంతం



లైట్లు వెలగకపోవటంతో చీకటిగా ఉన్న వంతెన